**కథ** -టి.వి.ఎస్. రామానుజరావు

# రేపటి మనుచరిత్ర

**"ఏమిటీ, అదోలా ఉన్నావు? మా అమ్మ మళ్లీ ఏమైనా అందా?" బూట్లు విప్పుతూ అడిగాడు రాఘవరావు.**

**మాట్లాడకుండా తల ఊపి లోపలికెళ్లింది ఊర్మిళ.**

**రాఘవరావు పాంటు విప్పి, హేంగర్‌కు తగిలించి, లుంగీ కట్టుకుని తల్లి గదిలోకి వెళ్లాడు. రాఘవరావును చూడగానే మొహం ఇంతైందా విడకు..**

''చూడరా, రాఘవా! మీ ఆవిడ ఇప్పటి దాకా నాకు కాఫీ గూడా ఇవ్వలేదు! పొద్దున్ననగా తిన్న అన్నం! ఏమైపోతానన్న జ్ఞానం లేదు దానికి'' నిష్ఠూరంగా అంది తల్లి.

''తను కూడా ఇప్పుడే కదమ్మా వచ్చింది! నువ్వైనా కలుపుకుని తాగొచ్చు కదా! ఇంట్లో బ్రూ ఉంది. తినడానికి నీ కోసం డబ్బాలో జంతికలో కారప్పూసో ఉంచుతోంది కదమ్మా'' విసుగ్గా అన్నాడు రాఘవరావు.

''అనరా, నన్నే అను! మీ అందరికీ భారమై పోయాను!'' కళ్లనీళ్లు పెట్టుకుంది తల్లి.

''అబ్బ, ఊరుకోమ్మా, నువ్వు మాకేం భారం కాదు! ప్రతీదీ అలా అనుకుంటే ఎలా! హాయిగా విశ్రాంతి తీసుకో! ఏదీ పట్టించుకోకు!''

''అంతేకానీ, దాన్నేం అనవు''

''చూశారా, చూశారా, ఇదీ వరస! రోజూ ఇదే సణుగుడు. మీరు ఆఫీసుకు వెళ్లగానే మొదలు పెడుతుంది. రోజూ స్కూలుకు పోయి అక్కడేదో కాలం గడిపి వస్తున్నా కానీ, ఇంట్లో ఉన్నానా. చచ్చానే!'' అంది ఊర్మిళ కోపంగా.

''నువ్వు కూడా ఏంటి ఊర్మి! ఆవిడకు ఎనభై ఏళ్లు! ఆ వయసులో రకరకాల భయాలు, చాదస్తాలు ఉంటాయి. మనం అర్థం చేసుకోవాలి. వాళ్లు మాట్లాడే ప్రతీదీ పట్టించుకోవడం అనవసరం'' భార్యను అనునయించాడు రాఘవరావు.

''అలాగే పట్టించుకోను గానీ ఇంటికి వచ్చిన వాళ్లకు నా మీద లేనిపోనివి కల్పించి మాట్లాడవద్దని చెప్పండి. మొన్నటికి మొన్న మీ పిన్ని వచ్చినప్పుడు ఆవిడతో నేను తనకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని, తనను సరిగ్గా చూడ్డం లేదని చెప్పింది. దాంతో మీ పిన్ని నాకో క్లాసు తీసుకుని, హితోపదేశం చేసి వెళ్లింది. మొన్న ఆదివారం సాయంత్రం విశాలాక్షిగారు నా కోసం వస్తే, ఆవిడతో నా మీద చాడీలు చెబుతుంది. ఇవేం బుద్ధులో ముసలావిడకు!'' కోపంగా అంది ఊర్మిళ.

రాఘవరావు మాట్లాడలేదు. టీవీ ఆన్ చేసుకుని చూస్తున్నాడు. పిల్లలు ఉన్నంత కాలం వాళ్ల చదువులు పాడవుతాయని టీవీ పెట్టనిచ్చే వాడు కాదు. చదువుల పేరుతో పిల్లలిద్దరూ తలో దిక్కుకు వెళ్లిపోయాక వంటరితనం బాధ ఎక్కువైంది ఇద్దరికీ. టీవీ అవసరం అప్పుడు తెల్సి వచ్చింది రాఘవరావుకు. బహుశా తల్లి కూడా ఈ నిశ్శబ్దాన్ని భరించలేక విసిగిస్తోందేమో ఊర్మిళను. ఇదివరకైతే ఇల్లు పిల్లలతో సందడిగా ఉండేది. ఆవిడతో ఎక్కువసేపు గడపకపోయినా నలుగురున్నారన్న సంతృప్తి ఉండేది. పిల్లలిద్దరూ వెళ్లిపోయాక ఇల్లు నిశ్శబ్దంగా మారిపోయింది.

రాఘవరావుకు టిఫిన్ ప్లేటులో పెట్టిచ్చి, తనో ప్లేటు తెచ్చుకుంది ఊర్మిళ.

''ఇదీవరస! రోజూ ఇంతే! అక్కడ స్కూల్లో పాఠాలు చెప్పి, వాళ్లతో అరిచి ఇంటికి వస్తే ఇక్కడ గుక్కెడు కాఫీ ఇచ్చే దిక్కు లేదు. సరిగదా రోజూ మీ అమ్మ సతాయింపు! రాత్రానను ఇల్లు నరకం అయిపోతోంది. మీ అమ్మను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిద్దాం. ఆవిడకు తనతో మాట్లాడే మనుషులు కావాలి. వేళకు తిండి అమర్చిపెట్టే వాళ్లుండాలి. ఇరవై నాలుగు గంటలు ఆమెని కనిపెట్టుకుని ఉండడం నా వల్ల కాదు. ఏ రోజైనా స్కూల్లో లేటయిందంటే ఆ వేళ నరకమే! వేళకు ఇంత తిండి పెట్టగలను. ఆవిడకు అన్నం పెట్టి చూడగలను, అంతేగానీ ఈ సతాయింపులు మాత్రం నేను భరించలేను'' ఊర్మిళ ఏ పదోసారో అలా అనడం!

రాఘవరావు విని ఊరుకున్నాడు.

''ఏదో ముసలావిడ పోనీలే అని ఊరుకున్నానో అదో తప్పు! 'పొగరు నీకు, అందుకే మాట్లాడవు' అంటుంది. 'మీకు సరిగ్గా వినపడ్డం లేదు, నేను అరచి చెప్పలేను' అన్నానుకోండి. నాకేం చెవుడు లేదు నీకే చెవుడంటుంది. విసిగి పోయి ఏదైనా అన్నానో శాపనార్థాలు పెడుతుంది. నా అవస్థ నీకు వస్తుందంటుంది ఎవరైనా ఓ ఆడమనిషి ఆవిడకు తోడుగా ఇంట్లో ఉండేందుకు దొరుకుతుందేమో చూడండి! నాకూ కాస్త రిలీఫ్‌గా ఉంటుంది. అలా కాదంటే మీరు ఆవిడను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించండి. కుదరదంటే చెప్పండి, నేనే ఓ రూమ్ తీసుకుని విడిగా ఉంటాను! ఇక ఆవిడను భరించడం నా వల్ల కాదు'' అంటూ ఆవేశం వెళ్లగక్కింది ఊర్మిళ.

రాఘవరావు అప్పటికీ మాట్లాడకపోవడం చూసి మళ్లీ చెప్పింది. ''నాకూ నలభై ఏడేళ్లొచ్చాయి. పాతికేళ్ల నుంచీ ఈ సంసారంలో వంటలు, వార్పులు, పెళ్లిళ్లు, పేరంటాలు, వచ్చేపోయే చుట్టాలు ఇవన్నీ నిభాయించుకుంటూ మరో పక్క ఉద్యోగం చేసి నాలుగు రాళ్లు మీ చేతిలో పోస్తున్నాను. ఎన్నాళ్లుంటుంది ఓపిక! ఒక్కరోజు పడుకున్నానంటే గుక్కెడు కాఫీ ఇచ్చే దిక్కు లేదు. ఎవరన్నా వండి పెట్టే వాళ్లుంటే బాగుండుననిపిస్తుంది! అసలు మన ఆరోగ్యాల గురించి ఏనాడన్నా పట్టించుకున్నామా! మనం కూడా పెద్దవాళ్లం అవుతున్నాం! ఆఫీసుల్లో టెన్షన్ల తోడు ఇంట్లో కూడా చికాకులుంటే ఆరోగ్యాలు పాడవుతాయి. మనం మూలపడితే చేసే నాథుడెవడూ లేడు. ఎవరో ఏదో అనుకుంటారని రోజూ ఇల్లు నరకం చేసుకోవడం, ఆపైన రోగాలు తెచ్చుకోవడం తెలివైన పని కాదు. మీ అమ్మకు కాలక్షేపం

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

సమస్య! అది మనం తీర్చలేం, అర్థం చేసుకోండి''


''నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వు'' అంటూ రాఘవరావు అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు.

నిట్టూరుస్తూ ఊర్మిళ వంట గదిలోకి వెళ్లింది.

ఆ మర్నాడు లంచ్‌టైంలో రాఘవరావు తన కొలీగ్ రామారావుతో బాధంతా వెళ్లబోసుకున్నాడు.

''ఇంటికెళ్లాలంటే భయమేస్తోందిరా! ఇల్లు నరకంలా తయారవుతోంది. నా భార్యకు, అమ్మకు అసలు పడడం లేదు. తనేం చేసినా అమ్మకు నచ్చదు. ఏదో వంక పెడుతుంది. ఇన్నేళ్లొచ్చినా తమ మీద ఇంకా పెత్తనం చేద్దామని చూస్తోందని మా ఆవిడకు కోపం. ఇంట్లో పనంతా పూర్తి చేసుకుని, అమ్మకు అన్నం పెట్టి స్కూలు కెడుతుంది. అయ్యో కష్టపడుతోంది కోడలనుకోదు అమ్మ. ఆవిడ పాతకాలం ధోరణి ఆమెది! ఉద్యోగాలు చేసి ఊళ్లేలాలా అంటుంది. చిలికి చిలికి గాలివానలాగా ప్రతీ రోజూ ఏదో ఓ గొడవ! అమ్మను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించమని నా భార్య ఈమధ్య పోరుపెడుతోంది. చూస్తూ, చూస్తూ కన్నతల్లిని దిక్కులేని దాన్లా ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించడం నాకిష్టం లేదు. అలాని చికాకును భరించలేకపోతున్నాను'' అంటూ రామారావుతో చెప్పాడు విషయమంతా.

రామారావు ఓ నిమిషం ఆలోచించి రాఘవరావు భుజం తట్టి ఇలా అన్నాడు. ''నేనో మాట చెబుతాను వింటావా! మీ అమ్మను వెంటనే హోమ్‌లో చేర్పించు! అనవసరమైన ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకు! మీ అమ్మ పాత కాలం మనిషి. ఆవిడ కాలంలో ఆడవాళ్లు గడపదాటి బయటకొచ్చే వాళ్లు కాదు. ఇవాల్టి పరిస్థితులు వేరు! భార్యా భర్తలు ఇద్దరూ సంపాదిస్తుండబట్టే సంసారంలో ఏ లోటూ లేకుండా గడపగల్గుతున్నాం! పిల్లల్ని పెద్ద చదువులు చదివించగల్గుతున్నాం! ఇది మీ అమ్మకు అర్థంకాక పోవచ్చు! అంతమాత్రాన మనం ఆడవాళ్లని ఇంటి పట్టునే ఉండి అత్తమామల్ని, సంసారాన్ని చూసుకోండని అనలేం కదా! నిజానికి మీ అమ్మతరం వాళ్లు, ఆ వెనకటి తరాల వాళ్లందరూ కూడా చాలా సుఖపడ్డట్టే గదా! మీ ఆవిడ నీతో బాటు బయటకొచ్చి, ఉద్యోగం చేస్తూ పిల్లలు, సంసారం దిద్దుకుంటూ మీ ఉమ్మడి కుటుంబంలో నీ కష్టాలన్నీ పాల్పంచుకుంది. ఇంకా ఆమేదో సేవలు చేయాలనుకోవడం నీ తప్పు. ఆమె చాలా మంచిది కనుకనే ఇవన్నీ చేయగలిగింది. రేపు నీ కోడళ్లు వస్తే వాళ్లు ఇంటి పట్టునే ఉంటారా? ముసలితనంలో మీకు సేవలు చేస్తారా! మారుతున్న కాలానుగుణంగా మనం కూడా మారాలి. ఇంతకీ మీ అమ్మకు కావాల్సింది కాలక్షేపం. ఆవిడ చెప్పే మాటలు వినే వాళ్లు ఉండాలి. ఆవిడ పెద్దరికాన్ని గౌరవించాలి. వయసు పెరిగే కొద్దీ పెద్దవాళ్లకు తాము చెప్పిందే కరెక్టన్న ధోరణి ఎక్కువ



వ్వడం మనం చూస్తూనే ఉన్నాం. తమాషా ఏమిటంటే తమతో పాటు తమ పిల్లలు పెద్దవాళ్లమవుతున్నారని వాళ్లు ఒప్పుకోరు. ఇదలా ఉంచి మీరిద్దరూ బయటకు వెడతారు! మీ అమ్మ ఆరోగ్యం బాగున్నంత కాలం ఆమెను ఇంట్లో వదిలేసినందువల్ల ఏ ఇబ్బందీ ఉండకపోవచ్చు. కానీ వయసు పెరుగుతున్నకొద్దీ ఆరోగ్య సమస్యలు రావచ్చు. రాత్రి మీరు వచ్చే దాకా ఆవిడ్ని ఒంటరిగా ఇంట్లో వదలడం మంచిది కాదు. ఇంట్లో ఎవరైనా మనిషిని పెట్టుకుంటేనే పర్లేదు. అలాంటి వాళ్లు, మంచివాళ్లు దొరకాలి కదా! అదే హోమ్‌లో అయితే, మీ అమ్మలాంటి వాళ్లు చాలా మంది ఉంటారు. ఒకళ్లకొకళ్లు తోడు! నలుగురు మనుషులు కనబడతారు. మాట్లాడతారు! ఒంటరితనం ఉండదు. ఈ వయసులో అదే వాళ్లకి కావాల్సింది. నా మాట విని అమ్మను మంచి హోమ్ చూసి చేర్పించు! నీ ప్రాబ్లమ్ తీరుతుంది'' అన్నాడు.

రాఘవరావు ఇంకా ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు.


''ఏమిటీ ఆలోచిస్తున్నావు? ఎవరైనా ఏమైనా అంటారనా?'' అడిగాడు రామారావు.

''అవున్రా, మా మావయ్యకు అమ్మ అంటే ప్రాణం! వచ్చినప్పుడల్లా అమ్మను బాగా చూసుకో అని చెప్పిపోతాడు. తీరా అమ్మనిట్లా హోమ్‌లో చేర్పించానని తెలిస్తే చాలా బాధపడతాడు''

''అవునయ్యా, బాధపడతాడు! అంతకంటే ఆయనా ఏం చెయ్యలేడు కదా! తనింటికి తీసుకెడతాడా?''

''అబ్బే, అదెట్లా కుదురుతుంది? ఆయన ఇంట్లో ఇబ్బందులు ఆయనకున్నాయి''

''అదే మరి చెప్పేది! ఎవడి ఇబ్బందులు వాడివి! మరొకడు తీర్చేవి కావు. అయినా ఈ రోజుల్లో ఓల్డేజ్ హోమ్ అంటే అనాథాశ్రమం అనుకోనక్కర్లేదు. ఇంట్లో ఉండడం వీలుపడక అనేకమంది తమంతట తామే వచ్చి అక్కడ ఉంటున్నారు. మన సుబ్బారావు వాళ్ల నాన్న, కొడుకు, కోడలి మీద అలిగి ఓల్డేజ్ హోమ్‌లో చేరాడు. అప్పుడప్పుడూ ఇంటికొచ్చి రెండ్రోజులుండి వెడతాడు. అంతెందుకు! మా మేనమామకందరూ కూతుళ్లే! ఆయన తన భార్యతో సహా వచ్చి ఓల్డేజ్ హోమ్‌లో ఉంటున్నాడు! కూతుళ్లు బతిమలాడినా అక్కడికెళ్లడు. తనకు ఇదే హాయిగా, స్వతంత్రంగా ఉందంటాడు! వీళ్లందరూ అనాథలేం కాదు! ఇంట్లోంచి తరిమివేస్తే, దిక్కులేని వాళ్లలాగా చేరలేదు! వాళ్లకు




ఈ వయసులో తోడు, కాలక్షేపం కావాలి! అది అక్కడ దొరుకుతుంది. మనం ఇంట్లో చూపించలేని శ్రద్ధ, ఆప్యాయత వాళ్లకక్కడ దొరుకుతాయి. ఇవ్వాళ్టి మన ఇరుకు జీవితాల్లో, ఉరుకుల పరుగుల బతుకుల్లో ఎవరి పట్లా మనం ప్రత్యేక శ్రద్ధ చూపించలేము. ఆఖరికి మన పట్ల మనం కూడా. నువు ఆలోచించుకో! నేనయితే ఇదే పని చేస్తాను. మొదట్లో అమ్మకు కష్టం అనిపించవచ్చు. నువ్వు చాలా మారిపోయావనీ, కోడలి చెప్పుడు మాటలు విని తనొదిలేశావని నింద వెయ్యవచ్చు! కానీ ఆ తర్వాత అలవాటు పడితే అక్కడ ఉండడమే బాగుందనుకుంటారు'' అంటూ చెప్పాడు రామారావు.

ఆ రోజు రాత్రి రాఘవరావు భార్యను అడిగాడు. ''రేపు సెకండ్ సాటర్‌డే గదా! నీకు సెలవేనా?''

''ఆ సెలవే! ఏం చేద్దాం!'' అడిగింది ఊర్మిళ ఆశ్చర్యంగా.

''మంచి ఓల్డేజ్ హోం ఉందని రామారావు చెప్పాడు. మనం ఇద్దరం రేపెళ్లి చూసి వద్దాం!'' అన్నాడు రాఘవరావు.

''ఇన్నాళ్లకు నేను చెప్పింది మీ తలకెక్కింది'' అన్నది ఊర్మిళ.

''అది కాదు ఊర్మీ. దిక్కులేని దాన్లా అమ్మని హోమ్‌లో పడేయాలని బాధపడ్డాను. పైగా నలుగురూ నన్ను ఏమంటారు? తల్లిని వదిలేశాడు చూడడం ఇష్టం లేక అంటారు. అయితే రామారావు ఆమెను హోమ్‌లో వెయ్యడమే మంచిదంటున్నాడు''

''నేను ఆవిడకు కావాల్సిందేమిటో అర్థం చేసుకున్నాను. మీరే మమ్మల్నిద్దర్నీ సరిగ్గా అర్థం చేసుకోలేదు. ముసలితనంలో మాట్లాడే తోడుండాలి. మనకు ఆవిడకు ఓ జనరేషన్ గ్యాపుంది. అస్తమానం ఆవిడ చెప్పే కబుర్లు మనం ఆవిడతో కూర్చుని వినడం కుదరదు. సమయం దొరికినా కూడా వినలేం! ఆవిడతో మాట్లాడేందుకు ఆ వయసు వాళ్లు ఇక్కడ ఎవరూ లేరు. ఒంటరితనం వల్లే ఆవిడ ఇలా ప్రవర్తిస్తోందని నాకు అర్థం అయ్యింది. అయితే స్కూల్లో పనిచేసి చేసి అలిసిపోయి వస్తే ఆవిడ రోజూ ఏదో రూపేణా సతాయిస్తుంటే నేను మాత్రం ఎంతని ఓర్చుకోనూ! ఇంట్లో ఈ అశాంతి వల్ల అందరి ఆరోగ్యాలు చెడతాయి. ఎవరో ఏదో అనుకుంటారని మనం ఇల్లు నరకం చేసుకుంటామా? అనే వాళ్లెవరూ మనకే సాయం చెయ్యరండీ! మన బతుకులేవో మనవి. ఆవిడ ఇంకా పది కాలాల పాటు ఆరోగ్యంగా బతకాలనే నా కోరికాను. ఆవిడకిప్పుడు కావాల్సింది తోడు, కాలక్షేపం! అమెరికాలో అయితే ఏ వయసులోనైనా ఆడైనా మగైనా పెళ్లిళ్లు చేసుకుని కలిసి ఉంటారు. మరి మన సాంప్రదాయం అలా ఒప్పుకోదు. ఏం చేస్తే ఆవిడకు మనం సరైన న్యాయం చేసిన వాళ్లం అవుతామని నేను చాలా ఆలోచించాను. నేనేదో ఆవిడను వొదిలించుకోవడానికి ఆమెని హోమ్‌లో వెయ్యమనడం లేదు. నిజానికి రేపు మనకు కోడళ్లు వస్తే వాళ్లు ఇంటిపట్టునే ఉండి, మనల్ని చూసుకుంటారనుకుంటున్నారా? మనం కూడా మరో పదేళ్ల తర్వాత ఇలా హోమ్‌లో చేరాల్సిందే. చేరడమే మంచిది కూడా. మనం స్వతంత్రంగా ఉంటాం. ఏ పోరు పొక్కు లేకుండా, కాలం మారింది. ఉమ్మడి కుటుంబాలు పోయి, న్యూక్లియర్ కుటుంబాలు వచ్చాయి. భార్యాభర్త, పిల్లలు ఇంతవరకే కుటుంబం అంటే. మిగతావారెవరైనా చుట్టాలే అవుతారు ఇక ముందు ముందు! అయినా మీరు మీ అమ్మనేం వదిలెయ్యడం లేదు అనాథగా. ఆవిడ క్షేమం కోసమే కాకుండా, ఇల్లు నరకం చేసుకోకూడదని హోమ్‌లో చేర్పిస్తున్నాం. ఇందులో మన స్వార్థమూ ఉంది. ఆవిడ కోసం చేసేది ఉంది. అసలు ఓల్డేజ్ హోమ్ అంటే అనాథాశ్రమం అనే భావన వల్ల ఈ గిల్టీనెస్ ఏర్పడుతోంది. అది 'పెద్దవాళ్ల సంరక్షణాలయం' అని అనుకోండి! అక్కడ వాళ్లకి కావాల్సిన కేర్ దొరుకుతుంది. కాలక్షేపం ఉంటుంది. ఆదరణ, ఆప్యాయత లభిస్తాయి. అవసరమైతే సకాలంలో వైద్య సేవలు దొరుకుతాయి. నేటి న్యూక్లియర్ కుటుంబాలు సమాజంలో మనలాంటి వాళ్లందరికీ ఈ హోమ్‌లు దేవుడిచ్చిన వరం లాంటివి'' అన్నది ఊర్మిళ.

రాఘవరావు ఆమె చెప్పిన దాంట్లో నిజం ఉందని గ్రహించి తలూపాడు.

☆